# ఈవారం కథ

# మార్పు

## న్యాయపతి కమలారాంజీ

"కనక మహాలక్ష్మికి పెళ్ళయి పోయింది"

అప్పడే పోస్టుమాన్ తెచ్చిచ్చిన ఉత్తరం చదివిన సూర్యం అందు లోని ముఖ్యమైన విషయాన్ని ఇంటిల్లిపాదికీ వినబడేలా అరి చేడు. అవధాని చేస్తున్న పనిని ఆపి తక్కున తలెత్తి చూసేడు. అతని చూపుల్లో కోపం, ఆశ్చర్యం, అనుమానం అన్నీ మిళితమై వున్నాయి.

"కనకానికి పెళ్ళి అయిపోయిందా? ఎక్కడ?. ఎవరితో? ఇంతకీ ఉత్తరం ఎవరు వ్రాసారు? చెప్పరా!"

"కనకానికి తిరుపతిలో పెళ్ళయింది. పెళ్ళి కొడుకు పేరూ? వివరాలూ లేవు యిందులో. లలితత్త వ్రాసింది"

"అంటే...పెళ్ళి...అయిపోయేక వ్రాసిందన్న మాట! పెళ్ళికి రావాలని వుంటే పెళ్ళికి ముందే అందేలా వ్రాసి వుండేది. కానీ మనం ఎవ్వరం పెళ్ళికి రావడం యిష్టం లేద న్నమాటేగా?" నిష్ఠూరం వెలువడింది సత్యవతి నోటివెంట.

"అంతే మరి. ముందే మనకీ కబురు తెల్సి పోతే వెళ్ళి పెళ్ళి ఆపేస్తాం అని భయం దానికి. ఆ కులం తక్కువ వాడికి కూతురినిచ్చి పెళ్ళిచే స్తానంటే వద్దన్నాంకదా అందరమూనూ. అందుకే గప్‌చుప్‌గా పెళ్ళి చేసేసి పెళ్ళి అయిపోయేక ఉత్తరంముక్క వ్రాసిపడేసింది" అవధానికి చెల్లెలి మీద పీకల దాకా కోపం వచ్చింది.

"ఏమంత ఖర్మ పట్టిందని! కనకం నిజంగా బంగారు బొమ్మ. బాపు బొమ్మలా వుంటుంది. మన వాళ్ళల్లోనే మంచి సంబంధాలు కొన్ని వున్నాయి. ఆ విశ్వనాథంగారబ్బాయి, బ్యాంకులో పనిచేస్తున్నాడు, వాడికి కనకాన్ని చేసుకుంటామని కబురు పెట్టారు కూడానూ. ఈలోగా కొంపలు మునిగిపోతున్నట్టు వాడెవడికో యిచ్చి కట్టబె ట్టేసింది. దీనికి అన్నింటికీ తొందరే!" విసు క్కుంటూ అన్నాడు అవధాని.

సత్యవతి గొణిగింది, "ఏమో మీరన్నట్టు కొంపలు మునిగిపోయే పరిస్థితి ఏర్పడి వుంటుంది. అందుకే అంత తొందర పడిపో యింది" ఆవిడ గొణుగుడు ఎవరూ వినలేదు కాబట్టి సరిపోయింది.

"అప్పటికి ఏదో కోపంలో అలా అనేసినా పెళ్ళికి ముందే పిలిస్తే ఎవరో ఒకరమైనా వెళ్ళే వాళ్ళం కదా" సూర్యం ఉత్తరం మడిచి టేబుల్ డ్రాయర్లో పెడ్తూ అన్నాడు.

"వెళ్తార్రా, వెళ్తారు. నేను చచ్చినా అలాంటి ముదనష్టపు పెళ్ళిళ్ళు సమర్థించను. రేపు ఎప్పుడైనా అది మనింటికి వచ్చినా నేను దానితో మాట్లాడేది లేదు. అసలు అది మన గుమ్మం తొక్కడానికి వీల్లేదు!" అవధాని రౌద్ర రూపం దాల్చేడు. నిప్పులాంటి వంశం తమది. అలాంటిది ఇది చేసిన పనివల్ల పరువు ప్రతిష్ఠలు మంటగల్సి పోతున్నాయని చాలా బాధపడిపోతున్నాడు అవ ధాని.

నిజానికి అవధానికి చెల్లెలంటే పంచ ప్రాణాలు. ఆమె భర్త పోయేడని కన్నీరు మున్నీరుగా విల పిస్తూంటే అత్తవారెవరూ ఆదుకోకపోతే తనే తీసుకొచ్చి చెల్లెల్నీ-చెల్లెలి కూతుర్నీ ఇంట్లో పెట్టు కున్నాడు. కనకాన్ని కాలేజీలో చేర్పించి చదువు చెప్పించేడు. ఆ తర్వాత కనకానికి తండ్రి పనిచేసిన ఆఫీసులో ఉద్యోగం ఇస్తే తల్లీ కూతుళ్ళు చోడవరం వెళ్ళిపోయేరు. చెల్లెలన్నా, చెల్లెలి కూతురన్నా విపరీతమైన అభిమానం. ఒక్కొక్క సారి సత్యవతి వుడుక్కునేది.

"మీ చెల్లెలిమీదున్న అభిమానంలో వదోవంతు అయినా నా మీదుంటె బాగుణ్ణు. లేదంటే నేను మీ పెళ్ళాంగా కాక చెల్లెలిగా పుట్టి వుంటే ఇంకా బాగుణ్ణు" అని!

అవధానికి మతిమరుపు ఎక్కువ.

ఎప్పుడూ సత్యవతిని పేరుపెట్టి పిల్చేటప్పుడు అవధాని నాలుక చివర 'లలితా' అన్న పేరే వచ్చేది.

"సరి సరి. నా పేరు కూడా మర్చిపోతున్నారు.



కొన్నాళ్ళకి నేను మీ పెళ్ళాన్ని అన్న సంగతే మర్చి పోతారులా వుంది" అంటూ దెప్పేది సత్యవతి.

పిల్లలు ముగ్గురూ నిశ్శబ్దంగా వుండిపోయేరు.

"పోన్లెండి. మనకి రానుపోను రైలు ఖర్చులు తప్పేయి. తిరుపతి అంటే మాటలా!" అంది సత్యవతి వాతావరణం తేలిక పర్చాలనే వుద్దేశంతో.

"అయినా అదేమంత కానిపని అని అంత సుండిపడిపోతున్నారు. ఈ రోజుల్లో ఎవరింట్లో చూచినా, ఎవరినోట విన్నా ఇలాంటి పెళ్ళిళ్ళే. కనకం మనసిచ్చిన కుర్రాడికిచ్చిచేస్తే దాని జీవితం సుఖంగా వుంటుందని ఆశపడింది. పిల్లల సుఖ సంతోషాలకంటే మనక్కావల్సినదింకేం వుంది? సమయాన్ని బట్టి మనం సర్దుకు పోవాలిగాని బిగుసుక్కూర్చుంటే ఎలా? కాలంతోపాటు మనమూ మారాలి" భర్తకి నచ్చజెప్తున్నట్టుగా అంది.

"నువ్వెన్ని చెప్పు, నాకు మాత్రం అది చేసిన పని ఏమాత్రం నచ్చలేదు. కనకం అంటే ఇంకా చిన్న పిల్ల. వయసు వేడిలో మంచీ చెడూ తెల్సు కోలేరు. తొందరపడిందే అనుకో. అది దేనికి వుంది? కూతుర్ని మందలించి అదుపులో పెట్టుకోవద్దూ!"

"అయితే ఏమిటంటారు? అదేం లేచిపోలేదు కదా. లక్షణంగా శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వివాహం జరిగింది. అయినా రేపు మన పిల్లలు ఏం చేస్తారో అది ఆలోచించండి ముందు. మీకూ ఆడపిల్లలు వున్నారు! అన్నీ మనిష్టప్రకారమే జరగాలంటే ఎలాగ? జరుగుతున్న వాటితో సర్దుకుపోయే స్వభావం మనం అలవర్చుకోవాలి. ఎదుటి వాళ్ళని ఒక వేలెత్తి చూపినప్పుడు మూడు వేళ్ళు మనవైపు వుంటాయన్న సంగతి మర్చిపోతున్నారు మీరు!"

"నోర్ముయ్యి! నా పిల్లలు అవనీ, ఎవరవనీ. అలాంటి కులం తక్కువ పన్లు చేస్తే ఇంట్లోంచి గెంటేస్తాను" బాగా కోపం వచ్చింది పెళ్ళాం మీద.

వాళ్ళ మాటలన్నీ వింటూన్న సూర్యం, సరోజ, సుధ గతుక్కుమన్నారు. బిక్క మొహాలేసుకుని వింటున్నారు.

వాళ్ళకి తండ్రి అంటే చాలా భయం.

ఏది కావాలన్నా, ఏది చెప్పాలన్నా తల్లి దగ్గరకే వెళ్తారు...

"గెంటేయండి. అందర్నీ ఇంట్లోంచి గెంటేయండి. అందరిళ్ళలోనూ పిల్లలు ఎలాంటి తప్పుడు పన్లు చేసినా కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నారు. ఎందుకో తెలుసా? పిల్లలకి దూరమై బ్రతకలేరు గనుక. వాళ్ళంతా వివేకవంతులు. విచక్షణా జ్ఞానం వున్న వాళ్ళు. మీ సంగతి అలాక్కాదు. మీకు పిల్లలకంటే

## అపూర్వ అనుభవం!

అమెరికాలోని ఒరిగాన్ విమానాశ్రయంలో 'పైపెర్‌కట్' సింగిల్ ఇంజన్ గల రెండు సీట్ల చిన్న విమానంలో 'పేటీషార్ప్' అనే ఇరవై మూడేళ్ల యువతి, పై నుంచి ఫోటోలు తీయడానికని బయలుదేరింది. ఆమె తండ్రి వయసు 62 ఏళ్ళు. ఆయన విమానం నడపసాగాడు. పోతూ పోతూ ఆయనకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో విలవిలలాడిపోయాడు. పేటీ వెంటనే ఎంతో సమయస్ఫూర్తితో ముందుకి వంగి కంట్రోల్ బటన్‌లను నొక్కి విమానాన్ని క్షేమంగా భూమి మీదికి దించింది. ఇంతకూ ఆమె అంతకు ముందెన్నడూ విమానం నడిపి ఎరగదు!

సేకరణ: భూక్యాగోపీనాయక్

పంతాలు–పట్టుదలలే ముఖ్యం."

"వాళ్ళంతా దద్దమ్మలు. ఏమీ చేతకాని వాళ్ళు. పిల్లల్ని ఎలా పెంచాలో అస్సలు తెలీదు వాళ్ళందరికీ. నా పిల్లలుగాని అలాంటి అప్రాచ్యపు పన్లు చేసారంటే పీక పిసికి చంపేస్తాను. తర్వాత నేనూ ఛస్తాను. అంతేకాని అలాంటి పెళ్ళిళ్ళకి వప్పుకోను" ఆవేశంతో వూగిపోతున్నాడు అవధాని.

సత్యవతికి అతని వాదన వింటూంటే ఎందుకో భయం కలిగింది.

"మనిషన్న తర్వాత మరీ ఇంత మొండితనం, పంతం పనికిరాదు. కొంచెం పట్టు విడుపు కూడా వుండాలి. అన్న నోరే అనిపించుకుంటుంది అని!...అనకూడదుగాని రేపు మన పిల్లలు ఏదైనా మీ కిష్టంలేని పని చేసేరనుకోండి.. వాళ్ళని చంపేస్తారుకదూ. బాగుంది. చాలా బాగుంది!" ఆవిడకి భర్తయొక్క అర్థంపర్థంలేని వాదన వింటూంటే దుఃఖం తన్నుకొస్తోంది.

* * *

ఇది జరిగిన సంవత్సరం తర్వాత–

కనకం బాగానే వుంది. అప్పుడే కొడుకు.

అవధాని మాత్రం పూర్తిగా చితికిపోయాడు.

దాదాపు పిచ్చివాడిలా తయారయ్యాడు.

సరోజ అసలే ముందు నించి చాలా భయస్తురాలు.

ఎవరినో ప్రేమించి ఆ సంగతి తండ్రికి చెప్పే ధైర్యం లేక నిద్ర మాత్రలు మింగి శాశ్వతంగా కళ్ళు మూసుకుంది.

సూర్యం, సుధ తండ్రితో మాట్లాడ్డం, ఎదురపడ్డం మానుకున్నారు. తనింట్లో తనవో శత్రువులా చూస్తూంటే, తన పిల్లలే తనని పరాయివాడిలా భావిస్తూంటే అవధాని భరించలేకపోయేడు.

ప్రతి నిముషం కళ్ళముందు సరోజ అమాయకమైన చూపు మెదుల్తూంటే గుండెని ఎవరో మెలిలిప్పినట్టుగా వుంది అతనికి. అంతటి కరకు హృదయం కరిగిపోయింది.

ఏడ్చేడు!

కుళ్ళి కుళ్ళి ఏడ్చేడు!

మనసులోవున్న కల్మషమంతా కడుక్కుపోయేలా భోరుమని ఏడ్చేడు! కన్న కూతురి మరణం అవధాని మనసుని ముక్కలు ముక్కలుగా చేసింది. పూర్తిగా కృంగిపోయేడు. సూర్యం, సుధల తిరస్కారం అంతకంటె ఎక్కువగా హృదయాన్ని రంపపు కోత కోస్తున్నది.

పిల్లలతో మాట్లాడకుండా, పిల్లలచేత 'నాన్నా' అని పిలిపించుకోకుండా...ఒక జడ పదార్థంలా బ్రతుకుతున్నాడు.

వద్దు వద్దు. తను ఈ నిర్లిప్తతని భరించలేడు. తనకి పిల్లలు కావాలి. పిల్లలు కావాలి.

సరోజ! తల్లీ...తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయావా?

తన అవివేకానికి ఆ అమాయకురాలు అనవసరంగా బలైపోయిందన్న భావనే అతన్ని నిలువనీయడం లేదు.

తను హంతకుడు. నేరస్తుడు. తన పాపానికి నిష్కృతి అంటూ ఏదీ లేదు. అవధానికి ఆలోచిస్తున్న కొద్దీ మతి పోతోంది.

తనలాంటి వాళ్ళకు ఏ శిక్ష విధించినా చాలదు.

అవధాని పశ్చాత్తాపాగ్నిలో దహించుకుపోతున్నాడు.

ఆఖరికి ఒక రోజు "సత్యవతీ! లలితనీ, కనకాన్ని రమ్మని కబురు పెట్టు. వాళ్ళని చూసి ఎన్నాళ్ళో అయిపోయింది. కనకానికి కొడుకుట కదా! చంటివాడ్ని కూడా తెమ్మను. దాని మొగుడ్ని కూడా...అదే లలిత అల్లుడ్ని కూడా రమ్మని చెప్పు..."

"ఏమండీ..." సత్యవతికి దుఃఖంతో నోట మాట రావడం లేదు.

తండ్రిలో వచ్చిన మార్పు పిల్లలు అర్థం చేసుకున్నారు!

నెమ్మదిగా తండ్రి దగ్గరకు వచ్చి అటూ–ఇటూ నించుని "నాన్నా" అని పిలిచేరు. అంతే! అతని పితృ హృదయం ద్రవించి పోయింది.

అతనిలోని వాత్సల్యం గట్టుతెగిన వాగులా ప్రవహిస్తూంటే పిల్లలిద్దర్నీ ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు.

అలా ఎంతసేపు వుండిపోయేరో వాళ్ళకే తెలీదు.